"నానీ..... నువ్వు నేనిప్పుడడిగే ప్రశ్నలకి కరెక్ట్‌గా జవాబులు చెప్పాలి."

"ఓ" తలూపాడు.

"అమ్మతోడుగా"

"ఒట్టంటే ఒట్టు- అమ్మ మీదొట్టు అన్నమాట."

నానీ చెప్పబోయే

జవాబు కోసం ఆసక్తిగా ఎదురు చూసే విశ్వేశ్వరశాస్త్రి, యశస్వి, హరితలు చూస్తున్నారు.

"మీ అమ్మంటే బాగా ఇష్టమా నీకు"

"బోలెడంత-"

"నీకు అమ్మ నిజమే నేర్పింది కదూ?"

"తాతయ్య కూడా"

"ఆ రాత్రి..... అదే మీ అమ్మగారు కాలిపోయాక అంతా నీకు గుర్తుందా?"

తలూపాడు.....

"బాగా గుర్తుచేసుకో"

"అంతా గుర్తుందంకుల్"

"అసలేం జరిగింది...."

"......"

"చెప్పమ్మా"

"మరేమో..." చివరగా తాతయ్య వేపు చూశాడు. యశస్విని చూస్తూ తండ్రివేపు క్షణం సూటిగా చూసి తల వంచుకున్నాడు "అప్పుడు బాగా చీకటన్నమాట..... అమ్మ వంటగదిలోకెళ్ళింది.... మంటల్లో కాలిపోతూ బయటకొచ్చింది."

"వంటగదిలో కెందుకెళ్ళింది?"

"ఎందుకంటే" క్షణం ఆగేడు "నేను పాలు కావాలన్నానన్నమాట"

"నేను అరిచేసరికి నాన్న, నాన్నమ్మ, అత్తయ్యా పరుగెత్తుకొచ్చారన్నమాట. అప్పటికే అమ్మ కాలిపోయింది" నానీ చెప్పాడు ఇంకా స్పష్టంగా.

"అంతా నా తప్పేనన్నమాట"

*    *    *    *

"చంద్రం" కోర్టు బయట నిశ్శబ్దంగా నిలబడ్డ చంద్రం కళ్లనుంచి నీళ్ళు కారుతున్నాయి "నువ్వూ, నీ తల్లీ, నీ చెల్లీ అందరూ ఆనందించండ్రా. ఒరేయ్..... ఇన్నాళ్ళూ మీరు చంపాలనుకున్నారే వాడు బ్రతుకు భయంతో సత్యాన్ని కాలరాసి నీకు కొడుకైపోయాడ్రా, నాకు మనవడు కావాలను కుంటే మీ మనిషైపోయాడు....." గగుర్పాటుతో రొప్పుతున్నాడు విశ్వేశ్వరశాస్త్రి "చట్టం నుంచి తప్పించుకున్నందుకు

గర్వపడకురొరే... నీకు మనసే వుంటే ఇప్పుడు
అబద్ధం చెప్పిన నానీ నిజాయితీ నిన్ను కాపాడలేదురా- దుర్మార్గాన్ని క్షమించేటంత ఎత్తుకెదిగి ఏ చట్టమూ విధించలేనంత చిత్త క్షోభని కలిగించాడు.... నీ రాక్షసత్వానికి తన దైవత్వంతో ఉరిశిక్ష వేశాడు."

నానీ నెమ్మదిగా నడుస్తున్నాడు. తన కోసం ప్రాణాలడ్డుపెట్టి పోరాడిన యశస్వి, హరితల మధ్యనుంచి.... తన ప్రాణాలు తీయాలని నిన్నటిదాకా వెంటాడిన తన వాళ్ల మధ్యనుంచి......

"ఒరేయ్" తనను సమీపించిన నానీని నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తున్నాడాయన. "నిన్ను లోకంలోకి పంపించింది నేను నేర్పిన వేదాన్నీ, ఉపనిషత్తుల్నీ తిరగరాయమని కాదురా. నేను చెప్పిన సత్యమే నిన్ను బ్రతికించే మందని తెలుసుకురమ్మని."

నానీ తల వంచుకున్నాడు.

నానీ కళ్ళముందు అమ్మ మెదిలింది. అనసూయమ్మ, తవిటయ్య, రాక్షసుడైన కొడుకునీ రక్షించి తన వాత్సల్యాన్ని తెలియచేసిన పేరిందేవి, కాశీనాథశాస్త్రి.... 'నిజం' నీరసిస్తూ తనను బలహీనుణ్ని చేసిన క్షణాలు వరుసగా స్ఫురించాయి.

నెమ్మదిగా తాత వేపు నడవబోతూ ఓసారి ఆగి వెనక్కి చూశాడు.

అక్కడ యశస్వి, హరిత చూస్తున్నారు.

"తాతయ్యా"

ఆర్తిగా పిలిచాడు.

"అమ్మా- నువ్వూ మరేమో హరిశ్చంద్రుడి కథ చెప్పి నిజమెంత గొప్పదో నాకు తెలియచేశారన్న మాట- కాని నాకు తెలిసింది అది కాదు తాతయ్యా...... ఆ కథ రాయబడిందీ అలా బ్రతికితే వచ్చే కష్టాల గురించి తెలియచెప్పడానికి..... ఆ.... అదన్నమాట."

మనవడ్ని వారసుడిగా అంగీకరిస్తూ అశ్రుపూరిత నయనాలతో
చేతులు సాచాడు.

ఇప్పుడు నానీ తాతయ్య ఒడిలో ఒదిగిపోయాడు. విశ్వంలో ఇమిడిన సత్యంలా- సత్యానికి సరికొత్త నిర్వచనంలా.

: అయిపోయింది :